సాక్షి సంగారెడ్డి

శనివారం । 11 । జనవరి । 2025



వైకుంఠపురం దేవాలయంలో దర్శనానికి బారులు తీరిన భక్తులు



బాలాజీ ఆలయంలో పూజలు నిర్వహించిన టీజీఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ అంజయ్య తదితరులు

ముక్కోటి.. పరవశించిన భక్తకోటి

ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని జిల్లాలోని వైష్ణవాలయాలకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. ప్రముఖ ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనాలు ఉదయం నుంచి కొనసాగాయి. ఆలయాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. సంగారెడ్డి పట్టణంలోని బాలాజీ టెంపుల్, పట్టణ శివారులోని వైకుంఠపురంలో ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. వైకుంఠపురం ఆలయ ప్రధాన అర్చకులు కందాడై వరదాచార్యులు వేకువజామునే పూజలు నిర్వహించి భక్తులకు ఉత్తర ద్వార దర్శనాన్ని కల్పించారు. వైకుంఠపురం దేవాలయంలో టీజీఐఐసీ చైర్మన్ నిర్మలరెడ్డి, సినీ హీరో పూరి ఆకాష్, ఎస్పీ రూపేశ్ దంపతులు, డీఎస్పీ సత్తయ్య గౌడ్, ఆర్డీవో రవీందర్ రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బైపాస్ బాలాజీ ఆలయంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, నిర్మలారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారతి సిమెంట్స్ ఆధ్వర్యంలో వేల మంది భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

– సంగారెడ్డి టౌన్:



ప్రత్యేక అలంకరణలో వైకుంఠపురం వెంకటేశ్వర స్వామి





స్వామివారికి మొక్కుతున్న యువతి, చిన్నారి

న్యూస్‌రీల్

శ్రీవారిని దర్శించుకున్న ఖేడ్ ఎమ్మెల్యే



తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి దంపతులు

నారాయణఖేడ్: వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ రెడ్డి ఆయన సతీమణి అనుపమారెడ్డితో కలసి శుక్రవారం తెల్లవారు జామున తిరుమలలోని శ్రీ వెంకటేశ్వర స్వామివారిని ఉత్తర ద్వారం గుండా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గ ప్రజలు సుఖంగా ఉండాలని స్వామివారిని కోరుకున్నానన్నారు.

ఆయురారోగ్యాలతో ఉండాలి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: స్వామి వారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆకాంక్షించారు. వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం, అదేవిధంగా జేపీ కాలనీలో శ్రీ వెంకటేశ్వర భక్త బృందం అధ్యక్షుడు సీసాల రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన శ్రీనివాస కళ్యాణం మహోత్సవంలో వైకుంఠ ఏకాదశి పూజలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మునిపల్లి(అందోల్): గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బుదేరా మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మాధవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు 5వ తరగతికి అర్హులన్నారు. 5వ తరగతిలో ప్రవేశాల కోసం కామన్ ఎంట్రెన్స్ ద్వారా ప్రవేశాలు తీసుకుంటామని తెలిపారు. 2025 ఫిబ్రవరి 1వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు.

ప్రజాభిప్రాయ సేకరణకు క్యూఆర్ కోడ్

పోలీసుల పనితీరుపై

జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్



పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్

సంగారెడ్డి జోన్: రాష్ట్ర పోలీస్ శాఖ పనితీరు, అవలంబిస్తున్న వివిధ రకాల కార్యక్రమాలపై ప్రజా అభిప్రాయ సేకరణ చేపట్టినట్లు జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ తెలిపారు. క్యూర్ కోడ్ ద్వారా ఈ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఇందులోభాగంగా జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో సంబంధిత క్యూఆర్ కోడ్‌ను అందుబాటులో ఉంచారు.

నాణ్యమైన భోజనం అందించాలి

గురుకులాల అదనపు కార్యదర్శి కిరణ్మయి

జహీరాబాద్‌టౌన్: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, శుభ్రతతో కూడిన భోజనం అందించాలని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల అదనపు కార్యదర్శి కిరణ్మయి స్పష్టం చేశారు. రంజోల్‌లోని బాలికల గురుకుల విద్యాలయాన్ని ఆమె శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గురుకులంలో వండే ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. నూతన మెనూ ఎలా ఉంది.. మెనూ ప్రకారం వంటలు వండుతున్నారా..నాణ్యమైన, రుచికరమైన భోజనం వడ్డిస్తున్నారా..అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలసి అక్కడే భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

తెరపైకి మరో కార్పొరేషన్!

తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీలను కలిపి ఏర్పాటు చేయండి

- సర్కారుకు ఎమ్మెల్యే గూడెం ప్రతిపాదనలు
- గ్రేటర్‌లో విలీనం చేస్తే నష్టపోతామని అభిప్రాయం



తెల్లాపూర్ మున్సిపల్ భవనం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీలను కలిపి మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ రెండు మున్సిపాలిటీలు గ్రేటర్‌లో విలీనం అవుతాయని చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే చేసిన ప్రతిపాదన సంచలనంగా మారింది. గ్రేటర్‌లో విలీనం అయితే.. చాలా నష్టపోతామని ఎమ్మెల్యే, స్థానిక ప్రజాప్రతినిధులు వాదిస్తున్నారు.

కార్పొరేషన్‌తో మరింత అభివృద్ధి

హైదరాబాద్ శివారు మున్సిపాలిటీలైన అమీన్‌పూర్, తెల్లాపూర్‌లను మున్సిపల్ కార్పొరేషన్ అయితే ఈ ప్రాంత మరింత అభివృద్ధి చెందే అవకాశముంటుదని స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు చర్చించుకుంటున్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున నిధులు వచ్చే అవకాశం ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ప్రత్యేక స్కీమ్‌లు వస్తాయని నేతలు చెబుతున్నారు.

జీహెచ్‌ఎంసీతో పోలిస్తే ఇక్కడే అభివృద్ధి

తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీలను ఆనుకుని ఉన్న గ్రేటర్ డివిజన్‌ల కన్నా ఈ రెండు మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. మున్సిపాలిటీకు పన్నులరూపంతో వస్తున్న ఆదాయంతో ప్రజల కోరిక మేరకు అభివృద్ధి పనులను చేపడుతున్నారు. ఈ రెండు ప్రాంతాలు రోజు రోజుకు మహానగరాలుగా విస్తరిస్తున్నాయి. ఇక ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా నేరుగా అధికారుల దృష్టికి తీసుకోనిపోయి సమస్యను పరిష్కరించుకుంటున్నారు. అదే గ్రేటర్‌లో విలీనం చేస్తే సమస్యల పరిష్కారం కోసం అధికారుల చుట్టూ తిరగాల్సివస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి రామచంద్రాపురం, భారతినగర్, పటాన్ చెరు డివిజన్లను ఉదాహరణగా ప్రజలు చూపుతున్నారు.

లక్షలలో జనాభా...

తెల్లాపూర్ మున్సిపాలిటీలో గత కొన్ని నెలల క్రితం పటాన్‌చెరు మండలంకు చెందిన ముత్తంగి, పాటి, ఘనాపూర్, పోచారం, కార్తనూర్ విలీనమైన సంగతి అందరికీ తెలిసిందే. మున్సిపల్ పరిధిలో 3 లక్షల జనాభా ఉంది. అమీన్‌పూర్ మున్సిపల్‌లో తాజాగా కిష్టారెడ్డిపేట్, పటేల్‌గూడ, సుల్తాన్‌పూర్, దయారా, ఐలాపూర్, ఐలాపూర్ తండాలో సుమారు 2 లక్షల జనాభా ఉంది.

తాజాగా కార్పొరేషన్ ప్రతిపాదనలు

తెల్లాపూర్, అమీన్‌పూర్‌లను మున్సిపల్ కార్పొషన్ చేయాలని స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి గత కొద్దిరోజుల క్రితం ప్రభుత్వ ముందు ప్రతిపాదనలు పెట్టారు. ప్రస్తుతం ఈ అంశం ప్రభుత్వ దృష్టిలో ఉన్నట్లు తెలుస్తుంది. మున్సిపల్ కార్పొరేషన్ చేయడం వలన నేతలు మేయర్, కార్పొరేటర్‌లు అయ్యే అవకాశాలుంటాయి.

కార్పొరేషనే బెటర్



తెల్లాపూర్ మున్సిపల్‌ను గ్రేటర్‌లో విలీనం చేయడం కన్న మున్సిపల్ కార్పొరేషన్ చేయడం వలన ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రజాసమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారమవుతాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటారు.

–ఈశ్వర్‌గారి రమణ, తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు

ప్రతిపాదనలు పెట్టాం



ఈ రెండు మున్సిపాలిటీలలో మరింత అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో మున్సిపల్ కార్పొరేషన్ చేయాలని ప్రతిపాదనలు పెట్టాం. దీనిపై ప్రభుత్వం ఆలోచన చేస్తుందని భావిస్తున్నాను.

– గూడెం మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే

అంజిరెడ్డికి ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం

- ఖరారు చేసిన బీజేపీ
- ఫలించిన అంజిరెడ్డి ప్రయత్నాలు
- పోటీ పడిన పలు జిల్లాల కీలక నేతలు



పట్టభద్రుల నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి డా.సి.అంజిరెడ్డి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: శాసన మండలి ఎన్నికల్లో ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిత్వం కోసం అంజిరెడ్డి చేసిన ప్రయత్నాలు ఫలించాయి. రానున్న శాసన మండలి ఎన్నికల్లో ఆ పార్టీ తరఫున పోటీ చేయనున్న అభ్యర్థుల జాబితాలో అంజిరెడ్డికి చోటు దక్కింది. సంగారెడ్డి జిల్లాకు చెందిన డాక్టర్ సి.అంజిరెడ్డిని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆ పార్టీ శుక్రవారం ప్రకటించింది. ఈ అభ్యర్థిత్వం కోసం పలు జిల్లాలకు చెందిన ముఖ్యనేతలు పలువురు ప్రయత్నాలు చేశారు. కానీ అధినాయకత్వం మాత్రం అంజిరెడ్డి వైపే మొగ్గు చూపింది. రామచంద్రాపురానికి చెందిన అంజిరెడ్డి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఉన్నారు. ఆయన సతీమణి గోదావరి అంజిరెడ్డి సంగారెడ్డి బీజేపీ జిల్లా అధ్యక్షురాలు. విద్యావంతుడు, పారిశ్రామికవేత్త అయిన అంజిరెడ్డిని బలమైన అభ్యర్థిగా ఆ పార్టీ భావించి పట్టభద్రుల అభ్యర్థిగా ప్రకటించిందని బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి.

రెండు దశాబ్దాలుగా పలు సేవా కార్యక్రమాలు

అంజిరెడ్డి తన ఎస్.ఆర్.ట్రస్ట్ ద్వారా గత రెండు దశాబ్దాలుగా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. నిరుపేద విద్యార్థులకు విద్యా అవకాశాలు, యువతకు ఉపాధి అవకాశాలు తన ట్రస్ట్ ద్వారా కల్పిస్తున్నారు. ఇటు పార్టీ పరంగా కూడా సంగారెడ్డి జిల్లా బీజేపీలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన ఆ పార్టీ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే అత్యధిక సభ్యత్వ నమోదు జరిగిన జిల్లాల్లో సంగారెడ్డి ఒకటి. గతేడాది జరిగిన ఎంపీ ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ స్థానం గెలుపులో తనవంతు కృషి చేశారు. ఆర్థికంగా కూడా బలమైన నేత కావడంతో ఆ పార్టీ అధినాయకత్వం ఈ టికెట్ విషయంలో అంజిరెడ్డి వైపు మొగ్గు చూపిందనే అభిప్రాయం రాజకీయవర్గాల్లో వ్యక్తమవుతోంది. 'నాపై నమ్మకం ఉంచి పార్టీ అభ్యర్థిగా ప్రకటించినందుకు బీజేపీ కేంద్ర నాయకత్వానికి కృతజ్ఞతలు' అని అంజిరెడ్డి పేర్కొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలి

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేశ్



హాస్టల్లోని ఆహారాన్ని పరిశీలిస్తున్న జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేశ్

సంగారెడ్డి టౌన్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పౌష్టిక ఆహారాన్ని అందించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేశ్ స్పష్టం చేశారు. శుక్రవారం సంగారెడ్డి మండలంలోని కోతలాపూర్ మహాత్మ జ్యోతిబాపూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉచితంగా న్యాయ సేవలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు కొత్త ఉత్సాహాన్నిస్తాయి

ఓపెన్ టు ఆల్ క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో అదనపు ఎస్పీ సంజీవరావు



వాలీబాల్ ఆడుతున్న సంజీవరావు

జిన్నారం (పటాన్‌చెరు): క్రీడల్లో సత్తా చాటి గ్రామీణ క్రీడాకారులు వెలుగులోకి రావాలని అదనపు ఎస్పీ సంజీవరావు పిలుపునిచ్చారు. జాతీయ యువజన వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం గుమ్మడిదల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మూడు రోజులపాటు సీజీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టు ఆల్ క్రీడా పోటీలను అదనపు ఎస్పీ సంజీవరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ...క్రీడలు నూతన ఉత్తేజాన్ని కలుగజేస్తాయన్నారు. గ్రామీణ క్రీడాకారులు ఇటువంటి పోటీల ద్వారా వెలుగులోకి వచ్చే అవకాశముందని తెలిపారు. క్రీడాకారులకు అనువైన క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ అధికారులు రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని అప్పుడే తగిన అవకాశాలు లభిస్తాయన్నారు. టోర్నమెంట్ లో పాల్గొంటున్న 32 వాలీబాల్, 35 కబడ్డీ జట్లను అభినందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ...క్రీడల్లో క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటుతూ ముందుకు వెళ్లాలని సూచించారు. అనంతరం వాలీబాల్ ఆటను ప్రారంభించి కాసేపు ఆడుతూ క్రీడాకారులను ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాభవాని, ఎంపీడీవో ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల సమీక్షలో కలెక్టర్ క్రాంతి



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న సంక్షేమ పథకాల సమీక్షలో జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరైన ఈ సమావేశంలో రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలు, లబ్ధిదారుల జాబితాల తయారీపై చర్చించారు.

పండుగపూటా పస్తులేనా!

- 45 రోజులుగా పాడి రైతులకు బిల్లుల పెండింగ్
- నవంబర్ 9న బకాయిలు విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వ ప్రకటన
- రెండు నెలలు గడిచినా అందని వైనం
- భారంగా మారుతున్న పశువుల పోషణ



వట్‌పల్లి(అందోల్): గ్రామాలలో పాల ఉత్పత్తిని జీవనోపాధిగా చేసుకుని జీవిస్తున్న పాడి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. పెండింగ్ బిల్లులు సకాలంలో విడుదల కాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. పశువుల పోషణ రోజురోజుకు తలకుమించిన భారమవుతోందని వాపోతున్నారు. ప్రతీ 15 రోజులకొకసారి బిల్లుల చెల్లింపులు జరగాలి. కానీ 45 రోజులుగా పాడి రైతులకు బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో సంక్రాంతి పండుగపూట కూడా పస్తులుండే పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పెండింగ్ పాల బిల్లుల విషయంలో రాష్ట్రవ్యాప్తంగా పాడి రైతులు ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేయడంతో డెయిరీ అధికారులు పెండింగ్ బిల్లుల విషయమై ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో నవంబర్ 9న రూ.50.65 కోట్లను విడుదల చేస్తున్నట్లు ప్రకటించి రెండు రోజుల్లో పాడి రైతుల ఖాతాల్లో జమ చేయాలని అధికారులను ఆదేశించింది. ఇంత వరకు బాగానే ఉన్నా బకాయిలు విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ రైతుల ఖాతాల్లో డబ్బులు జమకాలేదు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రెండు బిల్లులను నాన్చుతూ..

విజయ డెయిరీ పాడి రైతులకు మూడు బిల్లులు బకాయిలు పడటంతో ప్రభుత్వం రెండు బిల్లులు చెల్లిస్తామని తెలియజేయడంతో అధికారులు సెప్టెంబర్ రెండవ బిల్లు, నవంబర్ మొదటి బిల్లులను పెండింగ్‌లో పెట్టారు. ఆ తర్వాత వచ్చిన రెండు బిల్లులను రైతుల ఖాతాల్లో జమ చేశారు. పెండింగ్‌లో ఉన్న రెండు బిల్లులతో పాటు డిసెంబర్ 15 రోజులను కలుపుకుని మొత్తంగా 45 రోజుల పాల బిల్లులు ఇంకా చెల్లించాల్సి ఉంది.

రెండు రోజుల్లో పెండింగ్ బిల్లులు చెల్లింపు

పెండింగ్ బిల్లుల చెల్లింపులకు సంబంధించి ప్రభుత్వం ప్రకటించిన రూ.50.65 కోట్లు నిధుల విడుదల కాగానే బకాయిలు చెల్లిస్తాం. రెండు రోజుల్లో నిధులు విడుదలవుతాయని వెంటనే రైతుల ఖతాల్లో జమ చేస్తామని రాష్ట్ర ఉన్నతాధికారులు చెబుతున్నారు. బిల్లుల విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

–ఎస్.గోపాల్‌సింగ్, విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్

రూ.కోటి బకాయిలు..

జిల్లాలో 7 పాల శీతలీకరణ కేంద్రాలు ఉండగా రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య జిల్లా పరిధిలోని 50 పాడి ఉత్పత్తిదారుల సహకార సంఘాల ఆధ్వర్యంలో 180 పాల సేకరణ కేంద్రాల ద్వారా 3 వేలమంది రైతుల నుంచి రోజుకు 10 వేలకు పైగా పాలను సేకరిస్తున్నారు. గతంలో 15 రోజులకొకసారి జరిగే పాల బిల్లులు చెల్లింపులు ప్రస్తుతం నెలల తరబడి బకాయిలు పడుతుండటంతో 45 రోజుల పెండింగ్ బిల్లులు రూ.కోటి వరకు బకాయిలు పడ్డట్లు అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

గుడుంబా పట్టివేత



సారా ప్యాకెట్లు, నిందితుడితో పోలీసులు

నంగునూరు(సిద్దిపేట): గుడుంబా తరలిస్తున్న వ్యక్తిని శుక్రవారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. అక్కన్నపేట మండలం మాల్‌చెరువు తండాకు చెందిన గుగులోత్ శ్రీను మోటార్ సైకిల్‌పై 10 లీటర్ల నాటు సారాతో సిద్దిపేటకు వస్తున్నాడు. గట్లమల్యాల శివారులో తనిఖీ చేసి సారా ప్యాకెట్ పట్టుకొని రాజగోపాల్‌పేట పోలీసులకు అప్పగించినట్టు తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు పోస్టర్‌ను సదస్సు కన్వీనర్ డాక్టర్ శ్రద్ధానందంతో కలిసి ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో అట్టడుగు వర్గాలకు సమానత్వం, సమగ్ర సమాజం అనే అంశంపై మార్చిలో రెండ్రోజులపాటు ఈ సదస్సు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఓఈ డాక్టర్ గోపాల సుదర్శనం, డా.సీహెచ్ మధుసూదన్, డా. మదన్‌మోహన్, అధ్యాపకులు డా. ఉమామహేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న నరేశ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట) : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగళ్ల నరేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ సమావేశానికి నరేశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజా ప్రభుత్వంలో విద్యావ్యవస్థను, విద్యార్థులను పట్టించుకోవాలన్నారు. ఆరు నెలల కిందట ఉస్మానియా, కాకతీయ, మహాత్మా గాంధీ, తెలంగాణ, శాతవాహన తదితర యూనివర్సిటీల పరిధిలో నడుస్తున్న డిగ్రీ కళాశాలల్లో బోధన నిలిపివేసి యాజమాన్యాలు నిరసన తెలిపాయన్నారు. దీంతో విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత చదువులు చదవకుండా రాష్ట్ర ప్రభుత్వమే ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. వెంటనే ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వేల్పుల ప్రసన్నకుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు బానోతు నవీన్, బరిగే భారత్, ఇతర విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

దుబ్బాక ప్రభుత్వాస్పత్రిలో అరుదైన ఆపరేషన్

దుబ్బాక: దుబ్బాక ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం మరో అరుదైన ఆపరేషన్ జరిగింది. వైద్యుల కథనం మేరకు.. దుబ్బాక పట్టణానికి చెందిన గుండ్ల అపర్ణ రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతూ ఎన్నో ఆస్పత్రులకు తిరిగినా మెరుగుపడలేదు. ఈ క్రమంలో దుబ్బాక ఆస్పత్రికి రాగా డాక్టర్ హేమరాజ్‌సింగ్ ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించి కడుపులో మల్టీపుల్ ఫైబ్రాయిడ్ గడ్డలు ఉన్నాయని గుర్తించారు. వెంటనే అపర్ణకు ఆరోగ్య శ్రీ పథకం కింద ఆస్పత్రి సూపరింటెండెంట్, ప్రముఖ సర్జన్ డాక్టర్ హేమరాజ్‌సింగ్ ఆధ్వర్యంలో సర్జరీ చేసి 5 కిలోల మల్టీపుల్ ఫైబ్రాయిడ్ గడ్డలతోపాటు గర్భసంచిని తొలగించారు.

అవగాహన లేక.. అందుకోక

- బాధితులకు భరోసా కల్పించని 'హిట్ అండ్ రన్' పథకం
- అవగాహన లేక దరఖాస్తు చేయని వైనం
- గుర్తు తెలియని వాహనం ఢీకొని మరణిస్తే రూ.2 లక్షల పరిహారం
- గాయాలపాలైతే రూ.50 వేల సాయం అందజేత
- మూడేళ్లుగా జిల్లాలో 80 కిపైగా రోడ్డు ప్రమాదాలు
- పదుల సంఖ్యలో మృతి, కేవలం ముగ్గురికే లబ్ధి

రోడ్డు ప్రమాద బాధితులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'హిట్ అండ్ రన్' పథకం గురించి ప్రజలకు అవగాహన లేక వినియోగించుకోలేక పోతున్నారు. రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోతే చనిపోయినా, గాయాలపాలైన ఈ పథకం ద్వారా ఆర్థిక సాయం పొందవచ్చు. కానీ ఈ పథకం ప్రారంభించి మూడేళ్లు కావొస్తున్నా పోలీసు, రెవెన్యూ శాఖల నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు తెలియకపోవడంతో బాధిత కుటుంబాలకు భరోసా కల్పించలేకపోతోంది.



మెదక్‌జోన్: కేంద్ర ప్రభుత్వం హిట్ అండ్ రన్ పథకం 2022 సంవత్సరంలో ప్రవేశపెట్టింది. ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం గుర్తు తెలియని వాహనాలు రోడ్డుపై వెళ్తున్న ఎవరినైనా ఢీకొట్టి వెళ్లిపోతే ఆ వ్యక్తి చనిపోయినట్లు అయితే హిట్ అండ్‌రన్ చట్టం కింద కింద మృతుడి కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది. అదే విధంగా ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చేరితే చికిత్స నిమిత్తం సదరు వ్యక్తికి రూ.50 వేల ఆర్థిక సాయం అందిస్తోంది. ఈ పథకాన్ని ప్రారంభించి మూడేళ్లు అవుతుంది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 80కి పైగా రోడ్డు ప్రమాదాలు జరిగాయి. కానీ కేవలం ఐదుగురు మాత్రమే దీన్ని ఉపయోగించుకున్నారు. అందులో ముగ్గురు ఈ పథకం ద్వారా లబ్ధి పొందగా మరో ఇద్దరు దరఖాస్తు చేస్తున్నారు.

అధికారులు పోలీస్, రెవెన్యూ శాఖ పరిశీలనలో..

హిట్ అండ్ రన్ పథకం అమలు విధానం పోలీస్, రెవెన్యూ అధికారులపైనే ఉంటుంది. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోతే ముందుగా పోలీసులు ప్రమాద స్థలికి చేరుకొని కేసు నమోదు చేయాల్సి ఉంటుంది. అనంతరం ప్రమాదానికి గురైన వ్యక్తి మరణిస్తే ఈ సమాచారాన్ని ఆర్డీఓకు ఎఫ్ఐఆర్ కాపీతోపాటు పూర్తి సమాచారం నివేదిక రూపంలో అందించాలి. సదరు ఆర్డీఓ విచారించి ప్రమాదంలో గాయపడిన లేదా చనిపోయింది ఎవరు అనే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఆ నివేదికను కలెక్టర్‌కు అందించాల్సి ఉంటుంది. కలెక్టర్ పరిశీలించి ఫైనల్ చేస్తాడు. చివరగా బాధితుడు చనిపోతే అతడి కుటుంబానికి రూ. 2 లక్షల పరిహారం అందుతుంది. గాయాల పాలైతే క్షతగాత్రుడికి చికిత్స నిమిత్తం రూ. 50 వేలను అందిస్తారు. ఇంతటి ప్రాధాన్యత గల హిట్ అండ్ రన్ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో అధికారులు విఫలమయ్యారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మాకు పథకం గురించి తెలీదు

మా మేనత్తను మూడు నెలల కిందట అంబాజీపేట వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో చనిపోయింది. పోలీసులు సైతం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతోనే చనిపోయిందని కేసు నమోదు చేశారు. ఇలా చనిపోతే హిట్ అండ్ రన్ పథకం ద్వారా మృతుల కుటుంబాలకు డబ్బులు వస్తాయని తెలియదు. మేము ఎవరికీ దరఖాస్తు చేసుకోలేదు.

– బండారి నర్సింలు, గజగట్లపల్లి గ్రామం

జైలులో కుల వివక్ష ఉంటే ఫిర్యాదు చేయండి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ స్వాతిరెడ్డి
- జైలును సందర్శించి ఖైదీలతో ముఖాముఖి

సిద్దిపేటకమాన్: జైలులో కుల వివక్ష, మరేదైనా వివక్ష ఉంటే తప్పకుండా తెలియజేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి స్వాతిరెడ్డి అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి ఆదేశాల మేరకు న్యాయమూర్తి జిల్లా జైలును శుక్రవారం సందర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఏదైనా కులు ఆధారిత వివక్ష, ఇతర వివక్షకు సంబంధించి ఉన్నాయా అని ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సమాజంలో అందరూ సమానమేనని ఎవరినీ వేర్వేరుగా చూడకూడదని, అలాచేస్తే చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఎవరైనా వివక్ష చేస్తే ఒక లేఖ రాసి ఫిర్యాదుల బాక్స్‌లో వేయాలని సూచించారు.



మాట్లాడుతున్న స్వాతిరెడ్డి

జాతీయస్థాయిలో క్రీడాకారుల సత్తా

గజ్వేల్‌రూరల్: క్రీడాకారులకు సరైన ప్రోత్సాహాన్ని అందిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తారని టెన్నీస్, వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎస్‌కే హైదర్‌పటేల్ పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో గత నెల 31 నుంచి ఈ నెల 2 వరకు 26వ జాతీయస్థాయి టెన్నీస్ వాలీబాల్ సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో గజ్వేల్‌కు చెందిన యశ్వంత్, వివేక్, జూనియర్ విభాగంలో నర్సింలు, భానుప్రసాద్ పాల్గొన్నట్లు తెలిపారు. సబ్ జూనియర్ విభాగంలో రాష్ట్ర జట్టు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకోగా, ఇందులో గజ్వేల్ క్రీడాకారులు అత్యుత్తమ ఆటతీరును కనబర్చారు. ఈ సందర్భంగా విద్యార్థులతోపాటు పీఈటీ నర్సింలును అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న హైదర్‌పటేల్

కార్యక్రమంలో టెన్నీస్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నవీన్, పీడీలు రవీందర్, విజయరేఖ, గోవర్ధన్‌రెడ్డి, పీఈటీ భాను, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భార్య కళ్లెదుటే భర్త మృతి

- స్కూటీని ఢీకొట్టి ఈడ్చుకెళ్లిన లారీ
- భూ వివాదంలో 20 రోజులుగా కలెక్టరేట్‌కు తిరుగుతున్న దంపతులు

సిద్దిపేటఅర్బన్: స్కూటీని లారీ ఢీకొట్టడంతో భార్య కళ్లెదుటే భర్త మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట కలెక్టరేట్ వద్ద రాజీవ్ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కోహెడ మండలం తంగళ్లపల్లి గ్రామానికి చెందిన ఎర్రవెల్లి బాలకిష్టయ్య (59)కు బెజ్జంకి మండలం గుగ్గిళ్లకు చెందిన ఓ వ్యక్తితో వ్యవసాయ బావి విషయంలో భూ వివాదం కొనసాగుతోంది. వివాదం పరిష్కారం కోసం 20 రోజులుగా కలెక్టరేట్ చుట్టూ దంపతులిద్దరూ తిరుగుతున్నారు. శుక్రవారం సైతం అదే పని మీద భార్య రేణుకతో కలిసి స్కూటీపై కలెక్టరేట్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కలెక్టరేట్ ఎదుట రాజీవ్ రహదారిపై వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. అనంతరం కొంత దూరం ఈడ్చుకెళ్లడంతో తీవ్రగాయాలై బాలకిష్టయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న రేణుకకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేపట్టినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.



భర్త మృతదేహం వద్ద రోదిస్తున్న రేణుక

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు

వెల్దుర్తి(తూప్రాన్): నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన మండల కేంద్రం మాసాయిపేటలో చోటు చేసుకుంది. చేగుంట ఎస్ఐ చైతన్యరెడ్డి కథనం మేరకు.. మాసాయిపేట మండలం హకీంపేట గ్రామానికి చెందిన పత్తి కిష్టమ్మ(65) మేడ్చల్‌లో ఉంటున్న తన కూతురు వద్దకు వెళ్తుంది. మాసాయిపేటలో సబ్ రోడ్డుపై నడుస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తల, కాళ్లకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



కిష్టమ్మ(ఫైల్)

ఆటో పై నుంచి వెళ్లడంతో మహిళ

జిన్నారం (పటాన్‌చెరు): ఆటో మీది నుంచి వెళ్లడంతో మహిళ మృతి చెందిన ఘటన గుమ్మడిదల మండలం దోమడుగు పారిశ్రామిక వాడలోని ప్రగతి పాలిమర్ పరిశ్రమలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... మెదక్ జిల్లా రాజుపల్లి గ్రామానికి చెందిన భాగ్య (35) భర్త కుమార్, ఇద్దరు పిల్లలతో ఉపాధి కోసం వచ్చి దోమడుగు గ్రామంలో కొంతకాలంగా నివాసం ఉంటున్నారు. పాలిమర్ పరిశ్రమలో రోజువారి కూలీగా పని చేస్తుంది. శుక్రవారం భాగ్య నీరు తాగేందుకు వెళ్తున్న క్రమంలో లోడుతో ఉన్న ట్రాలీ ఆటో డ్రైవర్ గమనించకుండా వెనుకకు నడుపుతుండగా ప్రమాదవశాత్తు ఆమెపై నుంచి వెళ్లింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు.



భాగ్య (ఫైల్)

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాకటౌన్: విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాయపోల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు నమూనా పంచాయతీ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులందరూ తమ తల్లిదండ్రులు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేసేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

తొగుట(దుబ్బాక): భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు వజ్రాయుధంలాంటిదని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెంకట్రావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మాక్ ఎన్నికల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు రాజ్యాంగం పట్ల అవగాహన కలిగిఉండాలని సూచించారు. 18ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో ఓటు వేసి ప్రజా స్వామ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ నర్సయ్య, హెచ్ఎం నసిమా కౌసర్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇళ్లు దగ్ధం

రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం

వెల్దుర్తి(తూప్రాన్): విద్యుదాఘాతంతో ఇళ్లు దగ్ధమైన ఘటన మండలంలోని ధర్మారం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన టంటం నవీన్, టంటం ప్రభాకర్ సోదరులు గురువారం పనుల నిమిత్తం పొలం పనులకు వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత విద్యుదాఘాతంతో రెండు దగ్ధ మయ్యాయి. ఈ ఘటనలో బియ్యం, బట్టలు, టీవీ, వంట సామగ్రి, పట్టా పాసుబుక్‌లు కాలి పోయా యి. నర్సాపూర్ ఫైర్ స్టేషన్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వచ్చి మంటలార్పి వేశారు. ఘటనా స్థలాన్ని ఆర్ఐ నర్సింగ్‌యాదవ్ పరిశీలించి పంచనామా నిర్వహించారు. ప్రమాదంలో సుమారు రూ. లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆర్థికసాయం అందించాలని మాజీ సర్పంచ్ శంకర్‌రెడ్డి, గ్రామస్తులు కోరారు.



రోదిస్తున్న బాధితులు



పంచనామా నిర్వహిస్తున్న ఆర్ఐ నర్సింగ్‌యాదవ్

కాలిపోయిన బంగారం, నగదు

కొల్చారం(నర్సాపూర్): విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైన ఘటన మండలంలోని సంగాయిపేట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నగరం పద్మమ్మ రేకుల ఇంటిలో తండ్రీ కుమారులతో కలిసి ఉంటుంది. సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటిలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి వ్యాపించాయి. మంటల్లో రూ.70 వేల నగదు, అరతులం బంగారం, 30 తులాల వెండి, తిండి గింజలు, బట్టలు పూర్తిగా ఖాళీ బూడిద అయ్యాయి. ఘటనా స్థలాన్ని సందర్శించిన ఆర్ఐ ప్రభాకర్ పంచనామా నిర్వహించి ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం అందేలా చూస్తామని తెలిపారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ సాయి చరణ్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏడీఏ భిక్షపతి, వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు సుజాత, శేఖర్, జఫార్, కిషన్ రాథోడ్, మల్లారెడ్డి, నర్సింహులు, శంకర్, ఎంజీ రాములు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

రూ.14.45 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: సైబర్ వలలో చిక్కుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి భారీ మొత్తంలో నగదు పోగొట్టుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ సాయి భగవాన్ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి డిసెంబర్ 26న ఫోన్ టెలిగ్రామ్‌కు మెసేజ్ వచ్చింది. ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేయగా సైట్ నిర్వాహకులు ఓ వ్యాలెట్ ఐడీని క్రియేట్ చేసి ఇచ్చారు. ఉద్యోగి నగదు చెల్లించి టాస్కు లు చేయడం మొదలు పెట్టాడు. తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు వ్యాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.14.45 లక్షలు చెల్లించాడు. చివరగా తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడుగగా స్పందించలేదు. బాధితుడు తాను మోస పోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

నంగునూరు(సిద్దిపేట): అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం రాత్రి నంగునూరులో చోటు చేసుకుంది. ఎస్ఐ ఆసిఫ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన జంగిటి నర్సింహులు (36) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇంటి నిర్మాణం కోసం రెండేళ్ల కిందట రూ.5 లక్షలు అప్పులు చేశాడు. ఆటో సరిగా నడవక అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపం చెంది గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.



నర్సింహులు (ఫైల్)

చికిత్స పొందుతూ యువకుడు


గజ్వేల్‌రూరల్: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని కొడకండ్లలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఎంగు కిషన్(22)కు భార్య, కూతురు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. కిషన్ కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. 8న తమ వ్యవసాయ పొలం వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబీకులు చికిత్స కోసం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

మున్సిపాలిటీ పరిధిలో మరొకరు

గజ్వేల్‌రూరల్: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గజ్వేల్ పోలీసుల కథనం మేరకు.. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(వేములఘట్)కు చెందిన సూనూరి నర్సింలు (55)కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. వీరికి మండల పరిధిలోని కొల్గూరులో నివాస గృహముంది. మద్యానికి బానిసైన నర్సింలు మత్తులో 7న కొల్గూరులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహిత అదృశ్యం

కొండపాక(గజ్వేల్): వివాహిత అదృశ్యమైన ఘటన కొండపాక మండలంలోని వెలికట్ట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఉడుతల ఎల్లవ్వ(45) వ్యవసాయ పనుల కోసం కూలీలను తీసుకురావడానికి గురువారం ఇంట్లోంచి వెళ్లింది. శుక్రవారం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు బంధువులు, తెలిసిన వారిని వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఎల్లవ్వ కుమారుడు కమలాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



ఎల్లవ్వ

ఎన్‌పీఈలో సిద్దిపేట సంఘటనలు

ప్రజెంటేషన్ ద్వారా వివరించిన అధ్యాపకుడు నాగరాజు

దుబ్బాక : జాతీయ నూతన విద్యా విధానం(ఎన్‌పీఈ) 2020కి సంబంధించి న్యూఢిల్లీలో జరుగుతున్న సీసీఆర్‌టీ(సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రెనింగ్) సమావేశంలో అధ్యాపకుడు నాగరాజు వివరించారు. నాగరాజు ప్రస్తుతం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ కళాశాల అధ్యాపకుడిగా పని చేస్తున్నాడు. 8 నుంచి 28 వరకు న్యూఢిల్లీలో జరుగుతున్న సమావేశాలకు 9 రాష్ట్రాల నుంచి 120 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో డిజిటల్ డిస్ట్రిక్ట్ రేపోజ్ టోరి అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో నాగరాజు తెలంగాణ సాయుధ పోరాటంలో భాగంగా సిద్దిపేటలో జరిగిన ప్రముఖ సంఘటనలు వివరించారు. కూటిగల్, భైరాన్‌పల్లి, ఎద్ల గురువారెడ్డి, వీరనారి తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ పాత్ర గురించి వివరించారు. సిద్దిపేట జిల్లాలో చరిత్ర ఆనవాళ్లు లభించిన పుల్లూరు, నర్మెట్ట, రావురూకుల, వర్గల్ ప్రాంతాలను తెలియజేశారు. జాతీయ నూతన విద్యా విధానంలో తీసుకొస్తున్న మార్పుల్లో భాగంగా పాఠ్యాంశాల్లో ఈ సంఘటనలు పొందుపర్చే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్రం నుంచి 10 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు ఎంపిక కాగా ఇందులో అధ్యాపకుడు నాగరాజు ఒకరు.



ప్రజెంటేషన్ ఇస్తున్న రాధారి నాగరాజు

ఆకట్టుకున్న పడవల పోటీలు

- నర్సాపూర్ పట్టణంలోని బీవీఆర్ఐటీ కళాశాలలో నిర్వహణ
- పాల్గొన్న 16 సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థుల బృందాలు
- ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేత

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ పట్టణంలోని బీవీఆర్ఐటీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన పడవల పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. జాతీయస్థాయి విష్ణు నేషనల్ కాంక్రీట్ కానో (వియస్ సీసీసీ-2025) ఈ పోటీలు నిర్వహించగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ఆయా ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 16 బృందాల సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. కాబోయే సివిల్ ఇంజనీర్లు తయారు చేసిన ఆయా రకాల పడవలతో పోటీలకు ఉత్సాహంగా హాజరయ్యారు. పడవల డిజైన్, పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను బీవీఆర్ ఐటీ ఎడ్యుకేషన్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ అభినందించారు. ఈ పోటీల్లో నర్సాపూర్ బీవీఆర్ఐటీ కళాశాల విద్యార్థులు మొదటి స్థానం సాధించగా, రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జి టెక్నాలజీ బాసర విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు. విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ భీమవరంతో విజ్ఞాన భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ విద్యార్థులు మూడో స్థానం దక్కించుకున్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్ దుబే, సివిల్ ఇంజనీరింగ్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ డాక్టర్ ఎస్.కృష్ణారావు, ఆయా విభాగాల అధిపతులు, హెచ్ఓడీలు డీజీఎం కాంతారావు, మేనేజర్ బాపిరాజు, అశోక్ రెడ్డి, సురేశ్ పాల్గొన్నారు.



పడవల పోటీల్లో ఇంజనీరింగ్ విద్యార్థులు